## దరఖాస్తుల పరిశీలనలో లబ్ధిదారులు పాల్గొనాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీఎన్జీఓస్ నాయకులు

నల్లగొండ, డిసెంబర్ 17: ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను జనవరిలో పరిశీలన చేయనున్నందున లబ్ధిదారులు పరిశీలన బృందాలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి ఇండ్ల దరఖాస్తుల పరిశీలనపై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేయని వారు, గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్, ఎల్పీజీ సిలిండర్ సబ్సిడీ రాని వారు ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ అన్నారు. కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆయా మండలాల ప్రత్యేకాధికారులు, ఆర్డీఓలు, తాసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

**వసతి గృహాల్లో మెనూపై క్లారిటీ ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి**

నల్లగొండ : పెంచిన డైట్ చార్జీలతో వసతి గృహాల్లో కొత్త మెనూ అమలు చేయాలన్న ప్రభుత్వ గైడ్‌లైన్స్‌పై సమీక్ష చేసి ఎంత పరిమాణంలో ఇవ్వాలో క్లారిటీ ఇవ్వాలని హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, కార్యదర్శి జె. శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన కామన్ మెనూలో ఆహార పదార్థాలు ఎంత ఇవ్వాలనే క్లారిటీ లేదని, ప్రస్తుతం ఈ మెనూ అమలు చేయలేని విధంగా ఉండడంతో సమీక్షించి క్లారిటీ ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డీఐ రాజు, గోవర్ధన్, భీమగాని రణదివే, సత్యనారాయణ, సైదానాయక్, బాలకృష్ణ, రామకృష్ణారెడ్డి, రమ్యసుధ పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 17 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై బుధవారం నుంచి ప్రత్యేక బృందాలు సామాజిక తనిఖీ సర్వే చేపట్టనున్నట్లు ఎంపీడీఓ రాములునాయక్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనుల కోసం రూ.3.36 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. వీటిపై సామాజిక తనిఖీ చేపట్టనున్నారని తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీఓ లోకేశ్వర్‌రెడ్డి, ఏపీఓ రమేశ్, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌బీ గంగరాజు పాల్గొన్నారు.


చిరుమర్తి లింగయ్యతో కలిసి కేసీఆర్‌ను కలిసిన పున్న వెంకటేశం

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన వెంకటేశం

రామన్నపేట, డిసెంబర్ 17 : మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సిరిపురం మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి మంగళవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయి నుంచి బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేసీఆర్ సూచించినట్లు ఆయన తెలిపారు.

## రఘునాథపురం మండలం ఏర్పాటుపై అసెంబ్లీలో ప్రస్తావన


అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

రాజాపేట, డిసెంబర్ 17 : మండలంలోని రఘునాథపురం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో మంగళవారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రస్తావించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమాధానమిస్తూ కలెక్టర్ నుంచి నివేదిక తెప్పించుకొని మండలం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. మండలం ఏర్పాటుకు కృషి చేస్తున్న ఐలయ్యకు రఘునాథపురం గ్రామ మాజీ సర్పంచ్ గడిపల్లి శ్రవణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ బుడిగె రేణుకాపెంటయ్య గౌడ్, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


వనం బాలరాజు (ఫైల్)

రామన్నపేట, డిసెంబర్ 17 : మండలంలోని వెల్లంకి గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామానికి చెందిన వనం బాలరాజు (38) చేనేత వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమార్తెలు ఉన్నారు. కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దాంతో అతని భార్య అదే గ్రామంలోని తన తల్లిగారింటి వద్ద పిల్లలతో ఉంటుంది. ఈ క్రమంలో మద్యానికి బానిసైన బాలరాజు మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి చీరెతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పాఠశాల నుంచి తిరిగివచ్చిన తన పెద్ద కూతురు మధుబాల తండ్రిని కలిసేందుకు వెళ్లగా ఇంట్లో దూలానికి వేలాడడం చూసి భయంతో ఏడ్చుకుంటూ తల్లి వద్దకు వెళ్లి విషయం తెలిపింది. ఆమె స్థానికులతో కలిసి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పి.మల్లయ్య తెలిపారు.

## పంచాయతీ సిబ్బంది ముందస్తు అరెస్ట్


రాజాపేట : పోలీస్‌స్టేషన్‌లో గ్రామపంచాయతీ సిబ్బంది

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 17 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు తెల్లవారుజామున గ్రామపంచాయతీ సిబ్బందిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో కిష్టయ్య, స్వామి, జ్ఞానేశ్వర్, శ్రీను, లక్ష్మయ్య, మల్లయ్య, భారతమ్మ, లక్ష్మి ఉన్నారు.

రాజాపేట : చలో హైదరాబాద్ వెళ్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో వివిధ గ్రామాల గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ శరత్‌చంద్రపవార్

నల్లగొండ సిటీ, డిసెంబరు 17 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల సైబర్ నేరస్తులు సామాన్య ప్రజలు, ఉద్యోగస్తులను టార్గెట్‌గా చేసుకొని ముంబై, నార్కోటిక్స్, సీబీఐ పోలీసులమని చెప్పి మీపేరు మీద పార్సిల్ ఇరాన్, ఇరాక్, ఇజ్రాయిల్ దేశాలకు వెళ్లేందుకు బుక్ కాగా దానిని తాము పట్టుకున్నామని, కేసు నమోదు చేస్తే ఉద్యోగం పోతుందని చెబుతున్నారని పేర్కొన్నారు. కేసు నమోదు కాకుండా ఉండాలంటే డబ్బులు పంపాలని బెదిరిస్తున్నట్లు చెప్పారు. అలాంటి వాటిని ప్రజలు నమ్మి మోసపోవద్దని, అలాంటి ఫోన్లు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇటీవల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మహిళకు కాల్ చేసి ముంబై నార్కోటిక్స్ పోలీసులమని చెప్పి బాధితురాలి బ్యాంక్ నుంచి రూ.5 లక్షలు లూటీ చేశారని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాంటి ఫోన్లు వస్తే వెంటనే 1930కి గానీ, https//www.cYbercrime.gov.in/ లో రిపోర్ట్ చేసి దగ్గరలో ఉన్న పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ఆలేరు రెవెన్యూ డివిజన్‌ను అసెంబ్లీలో ప్రస్తావించడం హర్షణీయం


సమావేశంలో మాట్లాడుతున్న ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ సభ్యులు

ఆలేరు టౌన్, డిసెంబర్ 17 : ఆలేరు రెవెన్యూ డివిజన్ చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అసెంబ్లీలో ప్రస్తావించడం హర్షణీయమని ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ సభ్యులు అన్నారు. ఆలేరు పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడి రెవెన్యూ డివిజన్ ప్రకటన చేయడానికి కృషి చేయాలని ఐలయ్యను కోరారు. కమిటీ కన్వీనర్ వీరేశం, కో కన్వీనర్ రాచకొండ జనార్దన్, వెంకటేశ్, సలీం, అడవయ్య, సత్యం, కృష్ణ, కుమారస్వామి, అశోక్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 17 : మున్సిపాలిటీలో రోడ్లకు ఇరువైపులా చెట్లను తొలగించే కార్యక్రమం చేపడుతున్నందున బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరా యం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1:30నుంచి సాయం త్రం 5:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.


## హక్కులు అడిగితే అణిచివేయడం ప్రజాపాలనా?

- ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమార్

యాదగిరిగుట్ట, డిసెంబర్ 17 : నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 1.91 లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ అసెంబ్లీ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తామంటే అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడమే ప్రజాపాలనా? అని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ అన్నారు. మండలంలోని కాచారం గ్రామంలో మంగళవారం ఆయనను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాఠీలు, తూటాలు, అక్రమ అరెస్టులు ఉద్యమాన్ని అణచివేయలేరన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నోటిఫికేషన్ ప్రకటించడంలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో నిరసనలు తెలిపే హక్కు లేదా? అని ప్రశ్నించారు.

## ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించాలి

- డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

మర్రిగూడ, డిసెంబర్ 17 : మండలంలోని గ్రామాల్లో ఉన్న ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించాలని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ దవఖానలో వైద్యాధికారులు, ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగదా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే నిర్వహించి ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించాలన్నారు. ఆశ కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డా.వేణుగోపాల్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓలు కళ్యాణ్ చక్రవర్తి, కృష్ణకుమారి, సూపరిండెంట్ డాక్టర్ శంకర్, వైద్యులు దీపక్, సుమన్ పాల్గొన్నారు.

## నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి : టీఎస్‌యూటీఎఫ్


తాసీల్దార్ లాల్‌బహదూర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

రామన్నపేట, డిసెంబర్ 17 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఆధ్వర్యంలో తాసీల్దార్ లాల్ బహదూర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుగులు పట్టిన బియ్యం సరఫరా చేయడంతో విద్యార్థులు కడుపు నొప్పితో బాధపడుతున్నారన్నారు. జీర్ణ వ్యవస్థకు సంబంధించిన వ్యాధులతో అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. బడికి వచ్చే పేద పిల్లలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలన్నారు. మధ్యా హ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణం గా యూనిట్ కాస్ట్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కంచి రవికుమార్, సోషల్ మీడి యా జిల్లా కన్వీనర్ అనిల్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి మంకాల కుమారస్వామి, నాయకులు పల్లె మోహన్ రెడ్డి, సోమిరెడ్డి, కృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## దొంగిలించిన ఆటోతో పట్టుబడిన నిందితులు

వలిగొండ, డిసెంబర్ 17 : ఆటోను దొంగిలించి నంబర్ ప్లేట్ లేకుండా అందులో తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగారం గ్రామం వద్ద నంబర్ ప్లేటు లేని ఆటోలో ప్రయాణం చేస్తున్న ఇద్దరిని పోలీసులు మంగళవారం అడ్డుకొని విచారణ చేస్తుండగా పొంతన లేని సమాధానాలు చెప్పారు. దాంతో పోలీస్ స్టేషన్‌కు తరలించి గట్టిగా విచారించగా.. ఆటోను దొంగతనం చేసి పక్క రాష్ట్రంలో అమ్ముదామని వెళ్తున్నట్లు నిందితులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పఠాన్‌చెర్వు సుల్తాన్‌పూర్‌లోని కుమ్మరి బస్తీకి చెందిన చెన్న సత్యనారాయణ, చెన్న సురేశ్ ఆటో డ్రైవర్లు. ఈ నెల 8న భువనగిరిలో ఆటోను కిరాయికి మాట్లాడుకొని వేములకొండకు వచ్చిన వీరు.. తిరుగు ప్రయాణంలో వలిగొండ – భువనగిరి మార్గంలో ఆటో డ్రైవర్‌కు మద్యం తాగించారు. మద్యం మత్తులో ఉన్న ఆటో డ్రైవర్‌ను బెదిరించి ఆటోతో ఉడాయించారు. నేరాన్ని అంగీకరించిన నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

## కోమటిపల్లిలో పంచాయతీ ట్రాక్టర్‌కు మరమ్మతులు

**నేటి నుంచి చెత్త సేకరిస్తామని అధికారుల వెల్లడి**


పంచాయతీ ట్రాక్టర్ వద్ద ఎంపీఓ గోపి

అర్వపల్లి, డిసెంబర్ 17 : పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామానికి అందించిన ట్రాక్టర్లు, నిర్వహణ లేక మూలన పడ్డాయి. నిత్యం చెత్తనెత్తే ట్రాక్టర్లకు మరమ్మతులు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంట్లో భాగంగా మంగళవారం నమస్తే తెలంగాణలో 'పైసా లేని పల్లెలు' కథనాన్ని ప్రచురించింది. దాంతో మండల పరిధిలోని కోమటిపల్లిలో దాదాపు 9 నెలల నుంచి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వాడకంలో లేదు. గ్రామంలో ఎవరి చెత్త వారు ఇంటి ఎదుట కాల్చేస్తున్నారు. ప్రస్తుతం పనిచేయక చెట్ల పొదల మధ్య నిరుపయోగంగా ఉన్న గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించారు. బుధవారం నుంచి గ్రామంలో చెత్తను సేకరిస్తామని ఎంపీఓ గోపి, కార్యదర్శి కృష్ణవేణి తెలిపారు.

## ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరుగాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్


సఖి కేంద్ర నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, డిసెంబర్ 17 : ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఎక్కువ ప్రసవాలు జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆశ కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఎక్కువ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం, డిప్యూటీ డీఎంహెచ్ఓలు చంద్ర శేఖర్, డాక్టర్లు ఉమా మహేశ్వరి, నాజియా, జయమనోహరి, శ్రీశైలం, అనిత రాణి, సతీశ్, నాగరాజు పాల్గొన్నారు.

**ఆర్డీఓ, సఖి కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీలు**

సూర్యాపేట ఆర్డీఓ కార్యాలయం, సఖి కేంద్రాల్లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. ఆర్డీఓ కార్యాలయంలో ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆర్డీఓను ఆదేశించారు. అనంతరం సఖి కేంద్రాన్ని తనిఖీ చేశారు. సఖి కేంద్రం ద్వారా 1,288 కేసులు నమోదు చేయగా 981 కేసులు పరిష్కరించామని, 307 కేసులు వివిధ దశల్లో ఉన్నాయని సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. మహిళలకు స్కిల్ సెంటర్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ తర్వాత జిల్లాకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి తాత్కాలిక భవనం కోసం కలెక్టర్ స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో భవనాన్ని పరిశీలించారు. ఆర్డీఓ వేణుమాధవ్, ఎస్వీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్, సఖి కేంద్ర పరిపాలన అధికారి శైలజ, సుజాత, మానస తదితరులు పాల్గొన్నారు.

## వేములకొండ మత్స్య సహకార సంఘం ఎన్నికలకు నామినేషన్ల ప్రారంభం


వేములకొండ మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం ఎన్నికల్లో నామినేషన్ వేస్తున్న సంఘం సభ్యులు

వలిగొండ, డిసెంబర్ 17 : మండలంలోని వేములకొండ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో భాగంగా మంగళవారం నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. మొదటి రోజు అంబటి వెంకటేశం ప్యానెల్ నుంచి 10 మంది సభ్యులు నామినేషన్లను ఎన్నికల అధికారి శ్రీనివాస్‌కు అందజేశారు. అంబటి వెంకటేశం, దివిటి లక్ష్మయ్య, గన్నెబోయిన నరసింహ, అంబటి చిన్న సత్తయ్య, గూడెల్లి రామకృష్ణ, పూస సత్తయ్య, అంబటి యాదగిరి, అంబటి సత్తయ్య, అంబటి బాలమణి, అంబటి మల్లమ్మ నామినేషన్ పత్రాలను అందజేశారు.

## గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం గుర్తింపు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 17 : పట్టణంలోని ఏరియా దవాఖాన సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి.. భువనగిరి ఏరియా దవాఖాన సమీపంలో సుమారు 75 సంవత్సరాల వయసు గల వృద్ధుడు మృతిచెందినట్లు ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ నగేశ్ గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టగా వృద్ధుడు అనారోగ్యంతో ఉండి ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం వల్ల మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విచారణ అనంతరం మృతదేహాన్ని ఏరియా దవాఖానలోని మార్చురీకి తరలించి భద్రపరిచామన్నారు. ఆచూకీ తెలిసినవాళ్లు పట్టణ ఎస్ఐ అరుణ్‌కుమార్‌ను 8712579973కు గానీ, పోలీస్ స్టేషన్ 8712662803లో గానీ సంప్రదించాలని చెప్పారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు : సబ్ కలెక్టర్

మిర్యాలగూడ, డిసెంబర్ 17: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని సర్వే నం.626లో ప్రభుత్వ భూమి 3.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అక్రమ కట్టడాలను జేసీబీతో తొలగించారు. పోలీసు బందోబస్తు సాయంతో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ప్రహరీని, ఇంటి నిర్మాణానికి వేసిన పిల్లర్లను తొలగించారు. ఆ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆయన వెంట తాసీల్దార్ హరిబాబు, ఆర్ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, శ్యాంసుందర్ ఉన్నారు.

**చైర్మన్, తాసీల్దార్ మధ్య వాగ్వాదం**

అద్దంకి– నార్కట్‌పల్లి రహదారి వెంట సర్వే నం.626లోని ప్రభుత్వ భూమిని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ సోదరి రాయపూడి భవాని ఆక్రమించినట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్‌ను, ఇతర కట్టడాలను తొలగించారు. ఆక్రమణకు గురైన 3 గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు.

ఈ సమయంలో మున్సిపల్ చైర్మన్, తాసీల్దార్ హరిబాబు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తమది పట్టా భూమిని అని, కనీసం నోటీసులు ఇవ్వకుండా కూల్చడం ఏంటని భార్గవ్ నిలదీశారు. అది ప్రభుత్వ భూమి అని తమ విచారణలో తేలడంతో సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నట్లు తాసీల్దార్ తెలిపారు.

## నాలుగు కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

సూర్యాపేట, డిసెంబర్ 17 : దోసపహాడ్ గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో నాలుగు ఇండ్లు పూర్తిగా కాలిపోగా వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఆ బాధిత కుటుంబాలకు మంగళవారం పది వేల ఆర్థిక సహాయంతో పాటు నిత్యావరసర సరుకులు, దుప్పట్లను కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 11న పెన్‌పహాడ్ మండలం దొసపహాడ్‌లోని జంగాల కాలనీలో విద్యుదాఘాతంతో నాలుగు గుడిసెలు పూర్తిగా కాలిపోవడంతో పాటు వస్తువులు దగ్ధమయ్యాయని తెలిపారు. బాధితులు కడమంచి సాయమ్మ, కడమంచి గంగమ్మ, పర్వతం ధనమ్మ, పర్వతం లక్ష్మమ్మలకు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. తాసీల్దార్ లాలు, ఆర్ఐ రజింత్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ సతీశ్ పాల్గొన్నారు.

## ఉచిత విద్య, వైద్యం అందించాలి

- ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్


ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నరేందర్

భువనగిరి అర్బన్, డిసెంబర్ 17 : ప్రజలకు అత్యవసరాలైన విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని అనేక రకాలుగా విన్నవిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేనందున నిరాహార దీక్ష చేపట్టానన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, నిరుద్యోగులకు ఉపాధి, భూమిలేని వారికి ఎకరం భూమి, ఇల్లు లేనివారికి 200 గజాల ఇంటి స్థలం కేటాయించే వరకు దీక్ష కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బర్రె సుదర్శన్, కర్తాల శ్రీనివాస్, బట్టు రాంచంద్రయ్య, వినోద్, శ్రీను, అశోక్, లింగస్వామి, శాంతికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య**


సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న సంఘం నాయకులు

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 17 :రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం గడుస్తున్నా 1వ తేదీన పెన్షన్‌లు ఇవ్వడం తప్ప ఈహెచ్ఎస్, పీఆర్సీ, పెండింగ్ డీఏలు ఇవ్వడం లేదని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య అన్నారు. సూర్యాపేటలోని కిరాణ అండ్ ఫ్యాన్సీ మర్చంట్స్ భవనంలో మంగళవారం నిర్వహించిన జాతీయ పెన్షనర్ల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా 90మంది సీనియర్ పెన్షనర్లకు పూలమాలలు, మెమోంటోలతో సన్మానించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా డీటీఓ ఎస్.రవికుమార్, సుధాబ్యాంకు ఎండీ పెద్దిరెడ్డి గణేశ్, నాగార్జున డీసీబీ బ్యాంకు మేనేజర్ బి.రాంబాబు, కె.రవీందర్‌రెడ్డి, ఎండీ దేవదానం, సంఘం జిల్లా కోశాధికారి ఎస్ఏ హమీద్‌ఖాన్, సూర్యాపేట మండల అధ్యక్షుడు డి.శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్.నాగేశ్వర్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## సృజనకు పునాది పుస్తకాలు..

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్


సెమినార్‌లో మాట్లాడుతున్న గౌరీశంకర్

కోదాడ, డిసెంబర్ 17 : ఒక మంచి పుస్తకం జీవితాన్ని మార్చేస్తుందని, సృజనకు పుస్తకాలే పునాది అని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీ శంకర్ అన్నారు. కోదాడ కేఆర్ఆర్ జూనియర్ కళాశాలలో మంగళవారం సృజనకు పునాది.. పుస్తకాలు అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజ లోతు పాతులను విశ్లేషించి శాస్త్రీయ దృక్పథాన్ని అందించే ఒక పుస్తకం దేశ దశదిశను మారుస్తుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన జ్ఞానంతోనే దేశంలోని అట్టడుగు వర్గాల జాతుల విముక్తిని చేశారని తెలిపారు. పుస్తకాలు చదువుకున్న నాయకులు తన దేశానికి ఆలోచనలతో వ్యవస్థను శక్తివంతంగా తీర్చిదిద్దుతారని చెప్పారు.


## వాట్సాప్ గ్రూప్ దాతృత్వం

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 17 : మండల కేంద్రానికి చెందిన చేపూరి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామానికి చెందిన యాస గోవర్ధన్‌రెడ్డి 'మన ఆత్మకూరు వాట్సాప్ గ్రూప్'లో కోరాడు. దీనికి స్పందించిన దాతలు తోచిన సహకారాన్ని అందించారు. దాతలు అందించిన రూ.66వేల నగదుతోపాటు 50కిలోల బియ్యాన్ని మంగళవారం వెంకటేశ్వర్లు కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు యాస లక్ష్మారెడ్డి, జన్నాయికొడె నగేశ్, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గుండెగాని ఐలయ్యగౌడ్, గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పంజాల నర్సయ్యగౌడ్, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి రాచమల్ల సత్తయ్య, శివాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు కోరె మల్లేశం, రామలింగేశ్వర నాట్యకళామండలి అధ్యక్షుడు పైళ్ల దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

తుర్కపల్లి, డిసెంబర్ 17 : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం మేడ్చల్‌కు చెందిన మెడిసిటీ వైద్య బృందం ఆధ్వర్యంలో శ్వాసకోశ వ్యాధులకు సంబంధించిన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 150మంది రోగులకు ఊపిరితిత్తుల సమస్య, అలర్జీ, అస్తమా, న్యూమోనియా, గురక, క్షయ తదితర వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 40మంది రోగులను మెరుగైన వైద్యం కోసం మెడిసిటీ దవాఖానకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సృజన, దినేశ్, కీర్తన, రాజశేఖర్, హరీశ్, రేష్మి, మార్కెటింగ్ ఇన్‌చార్జీలు సుధాకర్, సంజయ్, సునీల్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలి : డీఈఓ


మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి అశోక్

కోదాడటౌన్, డిసెంబర్ 17 : సూర్యాపేట జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన –2024ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాధికారి కె. అశోక్ కోరారు. కోదాడ పట్టణంలోని సీసీఆర్ స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 19, 20వ తేదీల్లో సీసీఆర్ స్కూల్ కోదాడలో సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్వహణ కోసం 23 కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి దేవరాజు, ఎంఈఓలు, ఎండీ సలీంషరీఫ ఎస్. శ్రీనివాస్‌రావు, వివిధ కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

**DR. MMR COLLEGE OF PHYSICAL EDUCATION**
Thangadapally, Choutuppal, Yadadri Bhongiri Dist. Contact No.9390964913

**M.P.Ed SPOT ADMISSION**

| S.No. | RANK | H.T.NO. | Name |
|---|---|---|---|
| 1 | 113 | 57339510012 | ANKUSHAVALI MD |
| 2 | 158 | 57086820005 | AMBATI SATHISH |

The above said M.P.Ed Students have not attended to the College till today so you have to report at the college on 16/12/2024 if you have not reported your admission will be cancel and spot admission will be conducted on 17/12/2024 the eligible candidates of CPGET-2024 for spot admission will attend to the college with all orginal certificate and tutition fee pay on 17/12/2024.

Principal